సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం, 13 మే 2025



అన్నదాన భవనానికి రూ.లక్ష


కొత్తపేట: వాడపల్లి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి అడ్డగర్ల శ్రీనివాసరావు దంపతులు (అనకాపల్లి) రూ.1,00,008 విరాళం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

కోరుకొండ: గుమ్ములూరు శ్రీకృష్ణ దేవాలయానికి విశ్వహిందూధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం అందించారు.

బ్యారేజీ వద్ద పెరిగిన నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సముద్రంలోకి గోదావరి మిగులు జలాల విడుదలను నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

కొబ్బరి పరిశోధనా కేంద్రం అధిపతి చలపతిరావు బదిలీ



అంబాజీపేట: రాష్ట్రంలోనే ఏకైక కొబ్బరి పరిశోధనా కేంద్రమైన అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ ఎస్.బి.వి.చలపతిరావు బదిలీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ నుంచి ఆదేశాలు వచ్చాయని ఆయన సోమవారం తెలిపారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యాన సమాచార కేంద్రంలో ప్రిన్సిపల్ సైంటిస్టు హోదాతో పాటు ముఖ్య ప్రజా సంబంధ అధికారిగా నియమించారన్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలోని మహానంది ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి, ఉద్యాన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ముత్యాలనాయుడు అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్ర అధిపతిగా బదిలీ అయినట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి కృషి

బంగారు, వెండి వర్తకుల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని బంగారు, వెండి, డైమండ్ వర్తకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందని ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్ అన్నారు. అమలాపురంలోని యెండూరి హైట్స్ కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన రాష్ట్ర అసోసియేషన్ 3వ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 250 మంది ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. విజయకుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జరిగే రాష్ట్ర అసోసియేషన్ 4వ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం తిరుపతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ జైన్, జిల్లా బులియన్ అసోసియేషన్ తరఫున రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌ను సత్కరించారు. రాష్ట్ర అసోసియేషన్ చీఫ్ ఆర్గనైజర్ శాంతి లాల్జీ జైన్, రాష్ట్ర కార్యదర్శి బీఎంఆర్ శంకర్, అమలాపురం అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శి రాయుడు నాని, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

అమలాపురం టౌన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల జనరల్ విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు, ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులకు జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు తొలి రోజు జరిగాయని పేర్కొన్నారు. ఉదయం ప్రథమ సంవత్సరం మొత్తం జనరల్ ఇంటర్మీడియెట్ విద్యార్థులు 2004 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1,878 మంది హాజరయ్యారు. ఒకేషనల్ ఇంటర్ విద్యార్థులు 297 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 249 మంది రాశారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం మొత్తం జనరల్ ఇంటర్ విద్యార్థులు 295 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 264 మంది రాశారు. ఒకేషనల్ ఇంటర్ విద్యార్థులు 135 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 123 మంది రాశారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనతో పాటు జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిటింగ్ స్క్వాడ్స్, కస్టోడియన్స్ పర్యవేక్షించారని తెలిపారు.

సరస్వతీ నదీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

రావులపాలెం: సరస్వతీ నదీ పుష్కరాలకు సంబంధించి రావులపాలెం ఆర్‌టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ సోమవారం తెలిపారు. రావులపాలెం డిపో నుంచి వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాల దర్శనాలతో పాటు సరస్వతీ నదిలో పుష్కర స్నానం చేసే విధంగా రెండు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఈ నెల 15వ తేదీన రావులపాలెం నుంచి బయలుదేరుతున్నట్టు తెలిపారు. ప్రయాణికుల నుంచి విశేష స్పందన ఉన్న కారణంగా ఈ నెల 20వ తేదీన మరో రెండు బస్సులు పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పై క్షేత్రాలు దర్శనం అనంతరం మొదటి సర్వీసులు 22వ తేదీ రావులపాలెం చేరుతాయన్నారు. టిక్కెట్ ధర రూ.2,200గా నిర్ణయించామన్నారు. వేసవి సెలవుల సందర్భంగా విహారయాత్రలకు, తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్గో సేవలు కూడా విస్తృతం చేశామని ఒక కేజీ నుండి 10 టన్నుల వరకు మామిడి, అరటి, కొబ్బరికాయలు, లగేజీ తక్కువ చార్జీతో భద్రంగా– హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, సాలూరు, విజయనగరం, బెంగళూరు పట్టణాలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99592 25549, 99893 65239 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తీరంలో కొత్త మొలక!

- సముద్రపు నాచు సాగుకు శ్రీకారం
- మామిడికుదురు మండలంలో తొలి అడుగు
- చైనా, జపాన్‌లో పెరుగుతున్న డిమాండ్
- ఆహార ఉత్పత్తిగా గుర్తింపు... బిస్కెట్‌లు, పాస్తా, న్యూడిల్స్ తయారు
- నాచుతో పంట పొలాలు.. తోటలకు సేంద్రియ ఎరువు
- పశుగ్రాసాలు.. చేపల మేతలలో సైతం వినియోగం
- విజయవంతమైతే జిల్లాకు పర్యావరణంగా మేలు
- ఆక్వాతో ధ్వంసమవుతున్న తీరం
- ఆక్వాకు ప్రత్యామ్నాయం కానున్న నాచు ఉత్పత్తి



సముద్ర నాచు సాగు



సముద్ర నాచు సాగుకు కోనసీమలో అనువైన తీరాన్ని గుర్తించేందుకు నిపుణుల బృందం అధ్యయనం

సాక్షి, అమలాపురం: సముద్ర నాచు (సీ వీడ్) సాగు మరోసారి తెరపైకి వచ్చింది. గతంలోనూ ఈ సాగు ఉన్నప్పటికీ అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో పెద్దగా వెలుగులోకి రాలేదు. ఇటీవల కాలంలో గుజరాత్ సముద్ర నాచు తయారీ విధానం విజయవంతం కావడంతో రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో ఈ సాగు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం సాగుతోంది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా ఈ సాగుకు అనుకూలమైన ప్రాంతంగా గుర్తించడంతో శాస్త్రవేత్తలు, మత్స్యశాఖ అధికారులు ఇక్కడ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే మామిడికుదురు మండలంలో ఒక ఔత్సాహిక రైతు సాగు ప్రారంభించారు. తీరంలో ఈ సాగు విజయవంతం అయితే ఆక్వాకు ప్రత్యామ్నాయ సాగుగా మారడంతోపాటు ఆక్వా వల్ల పర్యావరణానికి కలుగుతున్న హాని తగ్గుతుంది.

సముద్రపు నాచు సాగుకు గతంలో ఒకసారి మంచి గుర్తింపు వచ్చింది. అయినా పాత పద్ధతిలో సాగు చేయడం వల్ల అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేదు. ఈ సాగు విజయవంతం అయితే తీర ప్రాంతాల్లో మత్స్యకారులకు, మహిళలకు, ఆక్వా రైతులకు స్థిరమైన ఆదాయం ఇచ్చేలా మారనుంది. మరీ ముఖ్యంగా కష్టాల వనామీ వంటి పంటలకు ప్రత్యామ్నాయం కానుంది. జిల్లాలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది నుంచి ఐ.పోలవరం మండలం భైరవపాలెం వరకు సుమారు 90 కిలోమీటర్ల తీరం ఉంది. ఏడు మండలాల్లో తీర ప్రాంతం ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ జిల్లా కన్నా కోనసీమలోనే ఆక్వాసాగు అధికం. సముద్ర నాచు సాగు చేపట్టేందుకు అనువైన స్థలం, వాతావరణం ఇక్కడ ఉంది. మామిడికుదురు మండలం గొల్లపల్లి, కరవాకల మధ్య ఈ సాగును ఒకరు మొదలు పెట్టారు.

అతి విలువైనది

సముద్ర నాచు చాలా విలువైనది. జపాన్, చైనాలో దీనిని ఆహారంగా తీసుకుంటారు. ఇప్పుడు మన ఆంధ్రప్రదేశ్‌లోనూ దీనికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నాచు పోషకాల నిధిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మందులు, ఎరువులు, పశువుల దాణాగా ఉపయోగిస్తున్నారు. బిస్కెట్లు, పాస్తా, నూడుల్స్ కూడా తయారు చేస్తున్నారు.

నాచు రకాలు

సముద్ర నాచులో గ్రేసిలేరియా, కప్పాఫైకస్, ఉల్వా, సర్గాస్సమ్ అనే రకాలు ముఖ్యమైనవి. ఇవి ఆకుపచ్చ, ఎరుపు, మట్టి రంగుల్లో ఉంటాయి. వీటిలో కప్పాఫైకస్ అల్వారెజీ రకం ఒకటి. దీని ద్వారా కేరాజినన్ అనే పదార్థాన్ని సేకరిస్తారు. ఇది ఆహార పదార్థాలు, ఔషధాలు, సౌందర్య సాధనాలలో వాడతారు. అలాగే గ్రేసిలేరియా ఎడ్యులిస్ రకం నుంచి అగర్ అనే పదార్థాన్ని సేకరిస్తారు. ఇది మైక్రో బయాలజీ, ఆహార పరిశ్రమ, ఔషధాల తయారీలో విస్తతంగా ఉపయోగిస్తారు. ఈ రెండు జాతులు రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయం కానున్నాయి. జిల్లాలో ఈ ప్రాజెక్టులకు గ్రీన్ క్లైమేట్ ఫండ్, నాబార్డ్ నిధులు అందిస్తాయని జిల్లా యంత్రాంగం చెబుతోంది


కోనసీమ అనుకూలం

సముద్రపు నాచు సాగు పైలట్ ప్రాజెక్టును కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. తొలుత మలికిపురం మండలం తూర్పుపాలెంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తరువాత జిల్లాలో అనువైన స్థలాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో జిల్లా యంత్రాంగం ఉంది. దీనిలో భాగంగా ఇటీవల సముద్రపు నాచు సాగులో నిపుణులు, సీఎస్ఐఆర్, సీఎస్ఎంసీఆర్ఐ, మండపం, తమిళనాడు శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో బృందం కోనసీమలోని పలు మండలాల్లోని తీర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించింది. జిల్లాలో కాట్రేనికోన మండలంలోని కొత్తపాలెం, పల్లం, నీళ్లరేవు, చిర్రయానం, గచ్చకాయల పోర, ఉప్పలగుప్తం మండలంలోని ఎన్.కొత్తపల్లి, ఎస్.యానం, వాసాలతిప్ప, మామిడికుదురు మండలం గోగన్నమఠం, కరవాక, గొల్లపాలెం, మలికిపురం మండలం తూర్పుపాలెం, సఖినేటిపల్లి మండలంలోని చింతల మోరి, కేశవదాసుపాలెం, అంతర్వేది, గొంది, అల్లవరం మండలం నక్కా రామేశ్వరం, కొమరగిరిపట్నం, ఓడలరేవు, రెబ్బనపల్లి తదితర గ్రామాలలో సముద్రపు నాచు సాగుకు అనువైన ప్రదేశాలను నిపుణుల బృందం పరిశీలించింది.

వనామీకి ప్రత్యామ్నాయం

సముద్ర నాచు సాగు విజయవంతం అయితే వనామీ సాగుకు ప్రత్యామ్నాయంగా మారనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వనామీ సాగులో సంక్షోభం వల్ల పలువురు రైతులు సాగుకు దూరమవుతున్నారు. సముద్ర నాచు నిలకడైన ఆదాయమని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. సముద్ర నాచు సాగుకు నాలుగు అడుగుల నీరు అవసరం. ఇప్పటికే తీరంలో చెరువులు సిద్ధంగా ఉన్నాయి. పంట దిగుబడి వచ్చేందుకు 45 నుంచి 60 రోజులు పట్టనుంది. ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తే ఏడాదికి నాలుగైదు పంటలు పండించే అవకాశముంది. ప్రస్తుత మార్కెట్‌లో కేజీ రూ.25 వరకు ధర ఉండగా, ఎకరాకు రూ.40 వేలకు తక్కువ కాకుండా ఆదాయం వస్తుందని అంచనా. అలాగే ఆక్వా వల్ల తీరానికి కలుగుతున్న నష్టం కూడా ఈ సాగు వల్ల తగ్గనుంది.

పైలట్ ప్రాజెక్టుగా..



సముద్ర నాచు సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసిన తర్వాత డీఆర్‌డీఏ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో సముద్ర తీర ప్రాంతాలలో పైలట్ ప్రాజెక్టుల్లో సాగు ప్రారంభిస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, సంప్రదాయ మత్స్యకారులు, యువకులలో ఔత్సాహికులను గుర్తించి వారికి సముద్రపు నాచు సాగులో శిక్షణ ఇవ్వడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా సాగు విజయవంతం చేస్తాం.

– ఆర్.మహేష్‌కుమార్, కలెక్టర్

అమర జవాన్‌కు నివాళి

పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు



అమలాపురంలో వీర జవాన్ మురళీ నాయక్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బోస్, విజయలక్ష్మి, విశ్వరూప్, జగ్గిరెడ్డి తదితరులు

అమలాపురం టౌన్: ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన అగ్నివీర్ జవాన్ మురళీ నాయక్‌కు జిల్లా వైఎస్సార్ సీపీ ఘన నివాళి అర్పించింది. అమలాపురం గడియారం స్తంభం సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం శ్రద్ధాంజలి ఘటించారు. రాజ్య సభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు, పార్టీ కో ఆర్డినేటర్ జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎంపీ చింతా అనురాధ, అమలాపురం, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్య ప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం వహించి ఆయన ఆత్మ శాంతికి శ్రద్ధాంజలి ఘటించారు. పాకిస్థాన్‌పై యుద్ధం చేస్తున్న భారత సైన్యానికి సెల్యూట్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ నాయకులు కాశి మునికుమారి, కుడుపూడి భరత్ భూషణ్, గొవ్వాల రాజేష్, కొల్లాటి దుర్గాబాయి నివాళులర్పించారు.

నాణ్యతతో అర్జీల పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్‌వో రాజకుమారి



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్: గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చే అర్జీలను నాణ్యతతో రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గోదావరి భవన్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. డీఆర్‌ఓ, డ్వామా పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి నోడల్ ఆఫీసర్ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఏఓ విశ్వేశ్వరరావు 215 అర్జీలను స్వీకరించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు జిల్లా కేంద్రానికి రావలసిన అవసరం లేకుండా ఆయా మండల, డివిజన్ కేంద్రాలలో అర్జీలను సమర్పించి పరిష్కార మార్గాలు పొందొచ్చన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీడీ మమ్మీ, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, డీసీహెచ్ఎస్ కార్తీక్, డీఎంహెచ్ఓ దుర్గారావు దొర, డీపీఓ శాంత లక్ష్మి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టీ.ప్రసాద్, ఎస్ఈపీఆర్ రామకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 26 అర్జీలు

అమలాపురం టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 26 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ ఫిర్యాదులను ఆయనకు అందజేసి సమస్యల పరిష్కారాన్ని అభ్యర్థించారు. ఎస్పీ ప్రతీ ఫిర్యాదును పరిశీలించి పరిష్కారానికి సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని సూచించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ముమ్మిడివరం: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బదిలీలు, ప్రమోషన్లలో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని ప్రాథమిక పాఠశాలలో 1:20 రేషియోను పాటించాలని, ఉన్నత పాఠశాలల్లో 1:40 గా విద్యార్థుల నిష్పత్తి ఉంచాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీవో 117 రద్దు చేస్తామని హామీ ఇచ్చి.. అంత కంటే ఎక్కువ నష్టం కల్గించే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో విద్యా వ్యవస్థను నష్టపరిచే విధంగా ప్రస్తుత ప్రభుత్వ విధానం ఉందని జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రమోషన్లు, బదిలీలకు సంబంధించి పూర్తి పారదర్శకతతో జీవోలు వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ పాఠశాలలో పోస్టులన్నీ భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీఎస్ సుబ్బారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు, జిల్లా గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జీవీ రమణ, టి.దుర్గాప్రసాద్ మండల ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



ధర్నా పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు

ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కేబుల్ ఆపరేటర్లు

అమలాపురం రూరల్: ఏపీ ఫైబర్ నెట్ వ్యవస్థ కార్యకలాపాలు దీన స్థితిలో ఉన్నాయని తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కేబుల్ ఆపరేటర్లు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఏపీ ఫైబర్ నెట్ వ్యవస్థను కాపాడి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ రాజకుమారికి సంఘం నాయకులు మాడాలక్ష్మి దుర్గప్రసాద్, లంకలపల్లి తాతాయ్యనాయుడు, ఇళ్ల కృష్ణ, గుమళ్ల పుల్లయ్యనాయుడు, అల్లు నాగేశ్వరరావు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రోజువారీ అత్యవసర సర్వీసెస్ అయిన ఆన్‌లైన్ వర్క్ ఫ్రమ్ హోమ్, డిజిటల్ చెల్లింపులు, స్కిల్ డెవలప్‌మెంట్, వీడియో కాన్ఫరెన్స్, ఇతర ఇంటర్నెట్ ఆధారిత సేవలు అందక జనం తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారని అన్నారు. ఉద్యోగులను తొలగించడంతో సాంకేతికంగా ఇబ్బందులు పరిష్కరించే సిబ్బంది లేక కేబుల్ ఆపరేటర్లు నష్టపోతున్నారని వారు తెలిపారు.

స్కాములతోనే కూటమి ప్రభుత్వం స్కీమ్‌లు

- కుట్టుమెషీన్ల పేరుతో రూ.245 కోట్లు దోచేశారు
- వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన



కుట్టుమెషీన్ల స్కామ్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు బోసు, వేణుగోపాలరావు, విజయలక్ష్మి, జగ్గిరెడ్డి, విశ్వరూప్, సూర్యారావు తదితరులు

అమలాపురం టౌన్: స్కాములతోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్కీమ్‌లు అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా నేతలు ముకుమ్మడిగా ధ్వజమెత్తారు. చివరకు బీసీ మహిళలకు ఇచ్చే కుట్టుమెషీన్లలో సైతం కూటమి ప్రభుత్వం రూ.245 కోట్ల స్కామ్‌కు పాల్పడిందని ఆరోపించారు.వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో అమలాపురం గడియారం స్తంభం సెంటరులో కూటమి ప్రభుత్వ కుట్టుమెషీన్ల స్కామ్‌పై జిల్లా పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రాజోలు నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్య ప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీ చింతా అనురాధ పాల్గొని కుట్టు మెషన్ల స్కామ్‌పై పోరుకు సిద్ధమంటూ ప్రకటించారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మంది లబ్ధిదారులకు కుట్టుమెషీన్లను అందజేసేందుకు 59 టెండర్లు వస్తే అందులో 56 టెండర్లకు అనర్హత వేటు వేసి కేవలం మూడే మూడు టెండర్లను పరగణనలోకి తీసుకున్నారని చెప్పారు. ఆ మూడింటిలో తమకు ఎక్కువ కమీషన్లు ముట్టజెప్పే టెండరుదారుడికి ఇచ్చారంటే కూటమి ప్రభుత్వ పాలన ఏ విధంగా సాగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వం మహిళలకు, బీసీలకు ఎంత పెద్ద పీట వేసిందో, చంద్రబాబు ప్రభుత్వం ఎంత మోసం చేస్తోందో ప్రజలు గ్రహించాలని బోస్ సూచించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు మోసాలకు పెట్టింది పేరు. కుట్టుమెషీన్ల విషయంలో కక్కుర్తి పడ్డారంటే ఆశ్చర్యం ఏమి ఉందని ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి మాట్లాడుతూ రూ.4,300 విలువ చేసే కుట్టు మెషీన్‌ను శిక్షణ, పంపిణీ పేరుతో రూ.23,500కి పెంచారని చెప్పారు. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం రూ.245 కోట్ల స్కామ్‌కు పాల్పడిందని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ కాల్వల మూసివేత తర్వాత టెండర్లు లేకుండా నీటి సంఘాలతో పనులు చేయించడం సరికాదని పేర్కొన్నారు. కనీసం షార్ట్ టెండర్లతోనైనా పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గతంలో జగన్ ప్రభుత్వంలో మాదిరిగా మహిళలకు ఇచ్చిన కుట్టుమెషీన్లకు అయ్యే వ్యయాన్ని డీబీటీ ద్వారా మహిళల బ్యాంక్ అకౌంట్లకే వేసి ఉంటే ఈ స్కామ్‌కు అవకాశం ఉండేది కాదని చెప్పారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ బీసీలకు కుట్టుమెషీన్లు, ఇస్త్రీ పెట్టెలు అందించి బీసీల స్థాయిని దిగదార్చవద్దు. కులగణనతో జనాభా దామాషా ప్రకారం మాకు రావాల్సిన వాటా రాయితీలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ స్కామ్‌లపై వైఎస్సార్ సీపీ పోరు మొదలైందన్నారు. మాజీ మంత్రి సూర్యారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పైకి బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు నటించి లోపల కమీషన్లు దండుకుంటోందని విమర్శించారు. రామచంద్రపురం పార్టీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ మహిళల దినోత్సవం రోజున కుట్టుమెషీన్ల పంపిణీ పేరుతో మహిళలకు టోకరా వేసిన ప్రభుత్వం ఇదని అన్నారు. అమలాపురం పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ కుట్టుమెషన్ల స్కామ్‌ను ఇప్పుడు వైఎస్సార్ సీపీ అడ్డుకోకపోతే కూటమి ప్రభుత్వంలో స్కామ్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. పి.గన్నవరం పార్టీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కీమ్‌ల పేరుతో స్కామ్‌ల చేసే కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ పోరాటాలతో ప్రజలు కళ్లు తెరిపిస్తామన్నారు. మాజీ ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ చంద్రబాబు స్కామ్‌ల పర్వానికి వైఎస్సార్ సీపీ పోరాటాలతో ముగింపు పలకాలని ఆకాంక్షించారు. కుట్టుమెషీన్ల ముందు వారు నిరసన వ్యక్తం చేశారు.

నినాదాలతో దద్దరిల్లిన అమలాపురం

స్కామ్‌పై నిరసన కార్యక్రమం ముగిశాక పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, మాజీ మంత్రి విశ్వరూప్‌లు 'ఇదేమి రాష్ట్రం... దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం... కుట్టు మెషీన్ల పేరుతో కూటమి దోపిడీ నశించాలి' అంటూ నినదించారు. వారి గొంతులో మిగిలిన పార్టీ నాయకులు కలిపి పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో అమలాపురం గడియారం స్తంభం సెంటరు దద్దరిల్లింది. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అమలాపురం, అల్లవరం ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు పితాని బాలకృష్ణ, అమలాపురం పట్టణ, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జి, పార్టీ జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్షులు వంగా గిరిజాకుమారి, షేక్ అబ్దుల్ ఖాదర్, జాన గణేష్, తోరం గౌతమ్ రాజా, సూదా గణపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న కారు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ఢీకొనడంతో కారుపై ఒరిగిన విద్యుత్ స్తంభం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో కొదండరామపురం వద్ద సోమవారం కారు అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొంది. విద్యుత్తు స్తంభం విరిగి కారుపై పడింది. దాంతో ఆ రోడ్డులో రాకపోకలు చేస్తున్నవారు పరుగులు తీశారు. పిఠాపురం వైపు నుంచి సామర్లకోట వైపు వస్తున్న కారు అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జునజ్జు అయింది. కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి వెంటనే కారు నుంచి దిగి పోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపి వేశారు. కారు నడుపుతున్న వ్యక్తి సూరంపాలెంలోని ఒక యూనివర్సిటీలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది.

పంట చేలోకి వెళ్లిన కారు



చేలోకి వెళ్లిన కారు

పెరవలి: అదుపు తప్పిన కారు పంట చేలోకి వెళ్లటంతో పాటు కొబ్బరి చెట్టును ఢీకొట్టి ఆగింది. పెరవలి మండలం వడలి- ముక్కామల ఆర్‌అండ్‌బీ రహదారిలో సోమవారం తెల్లవారు జాము జరిగిన ఈ ప్రమాదంలో చిన్ని చిన్న గాయాలతో బయటపడ్డారు. ఏ ఊరు వారో తెలియదు కానీ మద్యం మత్తులో కారు వేగంగా వచ్చిందని, అదుపు తప్పిన కారు ముందుగా ఎలక్ట్రికల్ స్తంభాన్ని రాసుకుంటూ వెళ్లి చేలో ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొట్టి ఆగిందని స్థానికులు చెప్పారు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావటంతో పరుగున వచ్చినా కారులో ఉన్నవారు వెళ్లిపోయారని తెలిపారు. అదే పగలు జరిగి ఉంటే పెను ప్రమాదం జరిగేదని రాత్రి అవ్వటం వలన జన సంచారం లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

బడి బస్సుల భద్రత ఎంత?!

- ఈ నెల 15తో ముగుస్తున్న పాత ఎఫ్‌సీ గడువు
- కొత్తగా ఎఫ్‌సీలు జారీచేస్తున్న అధికారులు
- స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటు తప్పనిసరి
- జిల్లాలో 835 పాఠశాల, కళాశాల బస్సులు

రాయవరం: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో బస్సుల వినియోగం పెరిగింది. జిల్లాలో వివిధ రకాల ప్రైవేట్ విద్యా సంస్థలు 580 వరకు ఉన్నాయి. వచ్చే నెల 12వ తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక శాతం మంది బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. బస్సు సామర్థ్యం సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఫలితంగా విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. అందుకే ఏటా మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు బస్సు కండిషన్ చెక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీ చేస్తుంటారు. గతేడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ఈ నెల 14తో ముగియడంతో, ఈ నెల 15 నుంచి కొత్తగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభమైంది. విద్యార్థులను సురక్షితంగా ఇంటి నుంచి పాఠశాలలకు, పాఠశాల నుంచి ఇంటికి చేరవేసే వాహనాల సామర్థ్యం (ఫిట్‌నెస్) ఎలా ఉంది? అన్న విషయాన్ని తేల్చే పనిని రవాణా శాఖ అధికారులు చేపట్టనున్నారు.



స్కూల్ బస్సు తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

835 పాఠశాల బస్సులు

కోనసీమ జిల్లాలో 580 వరకు ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల పరిధిలో 835 ప్రైవేట్ బస్సులు, వ్యాన్‌లు ఉన్నాయి. జూన్ 15వ తేదీలోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల యాజమాన్యాలు పొందాల్సి ఉంది. 2017 నుంచి స్కూల్ బస్సులకు స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి చేశారు. స్కూల్ బస్సుల వేగం గంటకు 60 కిలోమీటర్లు మించి ఉండకూడదు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ నిబంధనలివీ..

బస్సు డ్రైవర్‌కు బీపీ, సుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ సమర్పించాలి. ఈ సర్టిఫికెట్ బస్సులో ఒకటి, యజమాని వద్ద ఒకటి ఉంచాలి. బస్సు అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి. బస్సుకు ఉన్న గ్లాసులు అన్నీ పటిష్టంగా ఉండేలా చూడాలి. బస్సు నుంచి పొగ రాకుండా చూడాలి. బ్రేక్ కండిషన్‌లో ఉండాలి. స్పీడో మీటర్ పనిచేయాలి. స్టీరింగ్, టైర్లు కండిషన్‌లో ఉండాలి. డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. 60 ఏళ్ల లోపు వయసు ఉండాలి. బస్సులో అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం ఉండాలి. బస్సులో మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలి. వారానికి ఒకసారి ప్రిన్సిపాల్ లేదా సంబంధిత అధికారి దీన్ని తనిఖీ చేయాలి. నెలకొకసారి పేరెంట్స్ కమిటీ ఈ ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను తనిఖీ చేయాలి. దీనికోసం ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలి. బస్సులో సీట్ల కింద బ్యాగులు ఉంచుకునేందుకు అరల ఏర్పాటు ఉండాలి. సైడ్ విండోలకు మధ్యలో 31 అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చి ఉండాలి. ప్రతి విద్యా సంస్థ యాజమాన్యం విద్యాశాఖ, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, సౌజన్యంతో విద్యార్థులకు ఏడాదికి ఒక రోజు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి. బస్సు ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్ల ఎత్తుకు మించరాదు. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చబడి ఉండాలి. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి. బస్సు అటెండెంట్ బస్సు బయట దగ్గరగా నిలబడి విద్యార్థులు బస్సు నుంచి సురక్షితంగా దిగేలా, ఎక్కేలా చూడాలి. పాఠశాల వద్ద బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఉండాలి. బస్సులో అటెండర్ ఉండాలి. సీటింగ్ కెపాసిటికి మించి విద్యార్థులను ఎక్కించకూడదు. బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు పొందుపర్చాలి. రూట్ ప్లాన్ బస్సులో ఉంచాలి. విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు బస్సులో ఏర్పాటు చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకాన్ని ప్రతి నెలా యాజమాన్యం తనిఖీ చేయాలి. బస్సులో అటెండర్ తప్పకుండా యూనిఫామ్ ధరించాలి.

ఆన్‌లైన్లో తేదీల ఖరారు

జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు చేపట్టడానికి మండపేట, రామచంద్రపురం, అమలాపురం రవాణాశాఖ కార్యాలయాలు సన్నద్ధమయ్యాయి. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్లో నమోదు చేశాక ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తే, అందరి సమక్షంలో వాహన ఫిట్‌నెస్ తనిఖీ చేస్తారు. వాహన కండిషన్‌పై సమగ్ర పరిశీలన అనంతరం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. బస్సులు ఏ విధంగా ఉండాలన్న దానిపై విస్తృతమైన ప్రచారం చేయాల్సిన బాధ్యత రవాణాశాఖ అధికారులపై ఉంది.

నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం



మోటార్ వాహనాల నిబంధనలు పాటించని పాఠశాల, కళాశాలల బస్సులను సీజ్ చేస్తాం. పాఠశాలలు తెరిచిన నాటి నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. గడువు ముగిసిన తర్వాత ఎఫ్‌సీ, పర్మిట్, కండిషన్ లేని బస్సులను సీజ్ చేస్తాం.

– డి.శ్రీనివాసరావు, జిల్లా రవాణాశాఖ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

జిల్లా బ్యాడ్మింటన్ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా బ్యాడ్మింటన్ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం కాకినాడలో ఓ హోటల్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌వర్మ, కార్యదర్శిగా ఫణిగోపాల్, కోశాధికారిగా భాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా చుండ్రుగోవిందరాజు, కర్రి భామిరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డిని సంఘం ఎన్నుకుంది. ఉపాధ్యక్షులుగా ఎమ్.మురళీధర్, పీఎస్ గణేష్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కృష్ణమూర్తి, అడ్డాల సత్యనారాయణ, జగన్నాథ్, సభ్యులుగా కేవీబీ కృష్ణంరాజు, యు.రామకృష్ణ, కె.నరసింహారావు, వి.శారదాదేవి, కె.శ్రీనివాస్, లక్ష్మణ్‌కుమార్, రామ్‌మోహన్‌రావు ఎన్నికయ్యారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- ఆర్టీసీ బస్ నుంచి ఊడిన డీజిల్ ట్యాంక్
- డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్ నిలిపివేత



ఆర్టీసీ బస్ నుంచి ట్యాంక్ ఊడిపోవడంతో కారుతున్న డీజిల్

సీతానగరం: మండలంలోని వంగలపూడి ఏటిగట్టుపై పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్ డీజిల్ ట్యాంక్ ఊడి పోవడంతో గమనించిన డ్రైవర్ బస్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. లేకుంటే ఫైర్ అయితే తమ పరిస్థితి ఏంటని ప్రమాణికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్లితే సోమవారం ఉదయం 9 గంటలకు పురుషోత్తపట్నం నుంచి రాజమహేంద్రవరం వెళ్లతున్న ఆర్టీసీ బస్ డీజిల్ ట్యాంక్ వంగలపూడి – సింగవరం మధ్యలో ఊడి అందులోని డీజిల్ బయటకు లీకైంది. డ్రైవర్‌కు బస్ నుంచి శబ్దం రావడంతో ఏటిగట్టుపై బస్‌ని నిలిపివేశాడు. బస్‌ను గమనించగా డీజిల్ ట్యాంక్ ఒక వైపు ఊడి రోడ్డుపై రాసుకుంటూ వచ్చింది. బస్‌ను అలాగే నడిపి ఉంటే రోడ్డుపై ట్యాంక్ రాచుకుని నిప్పు రవ్వలు వచ్చి డీజిల్‌కు అంటుకుంటే ప్రయాణికుల పరిస్థితి ఏంటని, డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రయాణికులు, స్థానికులు డ్రైవర్‌ను అభినందించారు. ప్రయాణికులను వేరే ఆర్టీసీ బస్‌లో పంపించారు. పది కిలోమీటర్ల సీతానగరం – పురుషోత్తపట్నం రోడ్డు శిథిలం అవ్వడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గత నెలలో కూటమి నాయకులు రోడ్డుకు శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు రోడ్డు పనులు చేపట్టలేదు. రోడ్డు శిథిలమవ్వడంతో ఆర్టీసీ బస్‌లు తరచు పాడవుతున్నాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

10 మంది బైండోవర్

గోపాలపురం: మండలంలోని భీమోలులో వివాదాస్పద భూముల విషయంలో 10మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని భీమోలు గ్రామంలో సర్వే నంబరు 322లో గల 18 ఎకరాల మామిడి, జీడి మామిడితోట విషయంలో గ్రామానికి చెందిన మారెడ్డి రత్నం, కోడి దేవీవర ప్రసాద్ రెండు వర్గాలుగా ఏర్పడి భూమిలో గల పంటను ఎవరికి వారు మాకు చెందుతుందని తరచూ గొడవలు పడుతున్న నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రెండు వర్గాలకు చెందిన 10 మందిపై తహసీల్దార్ కె అజయ్‌బాబు ఆధ్వర్యంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రామేశ్వరంలో హత్య



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, తదితరులు

పెదపూడి: అత్తవారి ఇంటికి వెళ్లిన అల్లుడిపై అత్తింటి బంధువులు ఇనుప రాడ్లతో దాడి చేసి హత్యకు పాల్పడిన ఘటన ఇది. పెదపూడి ఎస్సై కె.రామారావు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి... రామేశ్వరం గ్రామంలో సత్యాడ వెంకటేష్(25) గ్రామ పంచాయతీలో ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. వెంకటేష్ ఎనిమిది సంవత్సరాల క్రితం గ్రామంలో రాణిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. అయితే ఆ భార్యాభర్తల మధ్య ఎనిమిది నెలలగా విభేదాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో భార్య అమ్మవారి ఇంటి వద్ద ఉంటోంది. అయితే ఈ నెల 11వ తేదీ సాయంత్రం వెంకటేష్ అత్త లక్ష్మి ఇంటికి వెళ్లాడు. అక్కడ అత్తతో ఘర్షణ ఏర్పడింది. ఈ సమయంలో అత్త తరఫున ముగ్గురు బంధువులు ఇనుపరాడ్లతో వెంకటేష్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయగా కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై తెలిపారు. కాకినాడ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు పటేల్‌దేవరా జ్‌మనీష్, సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై రామారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి సోమవారం బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో కొత్త పెళ్లికొడుకు మృతి



గోపాలకృష్ణ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్త పెళ్లికొడుకు మృతి చెందాడు. ద్రాక్షారామ పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం హసన్‌బాదకు చెందిన పిల్లి గోపాలకృష్ణ(27)కు గత నెల 22న వివాహం జరిగింది. గోపాలకృష్ణ కాజులూరు మండలం గొల్లపాలెంలో మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అత్తవారి ఊరు కె.గంగవరం మండలం శివల వెళుతూ ఉండగా యానాం వెళుతున్న ఆర్‌టీసీ బస్సుకు అతడి చొక్కా తగులుకోవడంతో ప్రమాదం సంభవించింది. తీవ్రగాయాలతో ఉన్న అతడిని స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా ఆసుపత్రిలో మృతి చెందాడు. వృద్ధాప్యంలో ఉన్న గోపాలకృష్ణ తల్లిదండ్రులు పిల్లి సూర్యనారాయణ, భూలక్ష్మిలకు కుమారుడు, కుమార్తె ఉండగా గోపాలకృష్ణ పెద్దవాడు. కుమార్తెకు ఇదివరకే వివాహం జరుగగా కొంచెం అమాయకంగా ఉండే గోపాలకృష్ణకు గత నెల 22నే వివాహం జరిగింది. కుమారుడి మృతితో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవ్వరితరం కావడం లేదు. దీనిపై ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని టీచర్ మృతి



విమలకుమారి మృతదేహం

నిడదవోలు రూరల్: కుటుంబ కలహాలు, భర్త వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ప్రైవేటు స్కూల్ టీచర్ మృతిచెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు సోమవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన పంతగాని విమలకుమారి (40) తిమ్మరాజుపాలెంలో ఒక ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త వెంకట శ్రీను విజయవాడలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. 2015లో వివాహమైన వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా భార్యాభర్తలు పలు విషయాల్లో గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి బంధువులు ఇంటికి వివాహానికి వెళ్లే సమయంలో వివాదం తలెత్తింది. దీంతో విమలకుమారి ఇంటి పైపోర్షన్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరబాబు పేర్కొన్నారు.

పిడుగు పాటుకు నాలుగు గేదె దూడల మృతి



గోపాలపురంలో పిడుగు పడి మృతి చెందిన గేదె దూడలు



గోపాలపురం జగన్నాథపురం గ్రామాల మధ్య భారీ వృక్షాలు నేలకొరగడంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

భారీ వృక్షాలు నేలకొరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం

గోపాలపురం: మండల కేంద్రమైన గోపాలపురంలో సోమవారం పిడుగు పడడంతో నాలుగు గేదె దూడలు మృతిచెందాయి. గోపాలపురం గ్రామానికి చెందిన అక్కాబత్తుల వెంకటేశుకు చెందిన పొలంలో నాలుగు గేదె దూడలకు సమీపంలో పిడుగు పడటంతో ఆ ధ్వనికి అవి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. గోపాలపురం నుంచి జగన్నాథపురం వెళ్లే రోడ్డులో భారీ వృక్షాలు నేలకొరగడంతో సుమారు ఆరు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ ఈదురుగాలులు వీచాయి. గోపాలపురం నుంచి కొయ్యలగూడెం వెళ్లే జాతీయ రహదారి మాతంగమ్మ మెట్ట వద్ద భారీ వృక్షం నేలకొరగడంతో అటు మూడు కిలోమీటర్లు, ఇటు మూడు కిలో మీటర్ల మేర ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు నాలుగు గంటలపాటు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ వైర్లపై చెట్టు పడటంతో వాటిని తొలగించడానికి సిబ్బంది అవస్థలు పడ్డారు. సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

నేడు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి జి.ఎలీషాబాబు సోమవారం తెలిపారు. సబ్ జూనియర్స్, అండర్-23 విభాగంలో జిల్లా క్రీడామైదానంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. సబ్‌జూనియర్స్ విభాగంలో 2008 నుంచి 2010, అండర్-23లో 2003 నుంచి 2006 మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. చిత్తూరులో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఎంపికైన జట్లు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గలవారు ఈ ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

రెండు చోరీ కేసుల్లో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: వేరు వేరు ప్రాంతాల్లో బంగారం, వెండి చోరీ చేసిన వ్యక్తికి ఒక్కొక్క కేసులో నాలుగు నెలల జైలు, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్‌షరీన్ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ సంజయ్‌నగర్ పర్లవపేటకు ప్రాంతానికి చెందిన సుంకర తేజ గత ఏడాది డిసెంబర్ 16 తేదీన గంగనాపల్లి గ్రామం చైతన్యనగర్ ప్రాంతంలో ఒక ఇంట్లో రూ.లక్ష విలువ గల బంగారం ఆభరణాలు చోరీ చేశాడు. తూరంగి మహాలక్ష్మినగర్‌లో గత ఏడాది డిసెంబర్ 23 తేదీన ఒక ఇంట్లో రూ.50 వేలవిలువ గల వెండి ఆభరణాలు చోరీ చేశాడు. దీంతో ఇంటి యజమానులు ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో సుంకర తేజపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ పి.రఘువీర్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

చీపురు కర్ర కోసం కొట్లాట

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య సోమవారం ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు గాయాల పాలై పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. అల్లవరం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడసకుర్రు బ్రిడ్జిని ఆనుకొని కొల్లు దుర్గారావు చేపల వ్యాపారం చేస్తున్నారు. వీరి షాపు పక్కన ఓలేటి అప్పల స్వామికి చెందిన పశువుల మకాం ఉంది. మకాంలో చెత్తను ఊడ్చే చీపురు కర్ర దుర్గారావు షాపులో ఉండడంతో అప్పలస్వామి మా పశువుల మాకాంలో ఉండవలస్సిన చీపురు కర్ర మీ షాపులో ఉండటమేమిటని ప్రశ్నించారు. అయితే దుర్గారావు భార్య మీ చీపురు కర్ర మేమే విరగొట్టాం. అయితే ఏమిటని మాటలతో ఎదురుదాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని కొట్లాటకు దారి తీసింది. దుర్గారావు, అతని భార్య, ముగ్గురు కుమారులు అప్పలస్వామిపై దాడి చేశారు. దీంతో అప్పలస్వామి కుటుంబ సభ్యులు దుర్గారావు కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఇరువర్గాల వారు ఆస్పత్రిలో చికిత్స కోసం జాయిన్ అయ్యారు. ఆస్పత్రి వారు అందించిన సమాచారం మేరకు ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుమలరావు తెలిపారు.

అడ్డుగా ఉందని పసిగుడ్డును చంపేశారు

- కేసును ఛేదించిన పోలీసులు
- కన్నబిడ్డను కడతేర్చింది తల్లి, అమ్మమ్మే!
- కేసును తప్పుదారి పట్టించడానికే క్షుద్రపూజల నాటకం
- వివరాలు వెల్లడించిన పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం: పాపం పుణ్యం తెలియని పసికందును తమకు అడ్డు వస్తుందనే కారణంగో కడతేర్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయినట్లు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో ఇటీవల పసికందును హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కేసు వివరాలను పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ కేసులో చనిపోయిన యశ్విత తల్లి అయిన పసుపులేటి శైలజ నరసింగపురానికి చెందిన పెదపాటి సతీష్‌ను ప్రేమించి ఇరు కుటుంబాలకు ఇష్టం లేకపోయినా వివాహం చేసుకున్నారు. 2024లో వారికి పాప యశ్విత జన్మించింది. వివాహం అయినప్పటి నుంచి భర్త తనను అత్తగారింటికి తీసుకెళ్లలేదని, పాప పుట్టిన తర్వాత భర్త కుటుంబ సభ్యులు చూడ్డానికి రాలేదని, తన భర్త కూడా తనతో మునుపటిలా సఖ్యతగా ఉండడం లేదని శైలజ ద్వేషం పెంచుకుంది. తన తల్లిదండ్రులు చూసిన సంబంధం కాదని, వేరే కులానికి చెందిన సతీష్‌ను వివాహం చేసుకోవడం ఆమె తల్లి పసుపులేటి అన్నవరానికి మొదటి నుంచి ఇష్టం లేకపోవడంతో సతీష్‌కు పుట్టిన యశ్వితను అడ్డు తొలగిస్తే శైలజకు రెండో పెళ్లి చేయవచ్చనే ఉద్దేశంతో ఆ తల్లి ఉంది. దీంతో ఇద్దరూ కలిసి పసికందును అడ్డు తొలగించుకోడానికి పథకం వేశారు. అందులో భాగంగా ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత 5 నెలల వయసు గల యశ్వితను వారి ఇంటిలోనే వారిద్దరూ పీక నొక్కి చంపేశారు. అనంతరం పాప మృతదేహాన్ని ఇంటి వెనక గల నీటి బావిలో పడవేశారు. అనంతరం హత్యను కప్పిపుచ్చడానికి పాపకు ఎవరో మాంత్రికుడు చేతబడి చేసి చంపి ఉంటాడని నమ్మించి కేసును తప్పుదోవ పట్టించడానికి వారి గుమ్మం ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయ పెట్టి గుట్టుచప్పుడు కాకుండా కొంతసేపు నిద్ర పోయినట్లు నటించారు. అనంతరం లేచి తమ పాపను ఎవరో ఎత్తుకు పోయారంటు పెద్దగా కేకలు వేస్తూ హడావుడి చేసి జనాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. ఏమీ తెలియనట్టు నటిస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పాప ఆచూకీ కోసం గాలించగా వారి ఇంటి పక్కనే ఉన్న బావిలో పాప మృతదేహం లభించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లతో ఆధారాలు సేకరించారు. పాప తల్లి శైలజ, అమ్మమ్మ పసికందును చంపి నూతిలో పడవేసి క్షుద్ర పూజల నాటకం ఆడినట్లు సాంకేతిక ఆధారాల సహాయంతో గుర్తించామన్నారు. పాప తండ్రి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ కేసులో నిందితులు ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఆయన తెలిపారు.



నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టిన పోలీసులు